క్లుప్తంగా

రాష్ట్రంలో కాంగ్రెస్‌కే ప్రజా మద్దతు



అలంపూర్: రాష్ట్ర ప్రజల మద్దతు కాంగ్రెస్ ప్రభుత్వానికే ఉందని ఏఐసీసీ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ అన్నారు. వడ్డేపల్లి మండలం శాంతినగర్‌లోని నివాసంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా గురువారం బరిలో ఉన్న మల్లు రవికి మద్దతుగా అలంపూర్, ఉండవెల్లి మండలాల్లో ప్రచారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మంత్రి జూపల్లి కృష్ణారావు, అభ్యర్థి ప్రచారంలో పాల్గొంటారని పేర్కొన్నారు. ఉదయం 9 గంటలకు జోగుళాంబ, బాలబ్రహ్మేశ్వర స్వామి ఆలయాలను సందర్శించి దర్శించుకుంటారని వివరించారు. అనంతరం అలంపూర్ మున్సిపాలిటీలోని గాంధీచౌక్‌లో ఉదయం 10 గంటలకు మండల స్థాయి బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు స్థానిక టూరిజం హోటల్‌లో మండలాల వారీగా ముఖ్య నాయకులతో సమావేశం ఉంటుందని చెప్పారు. రెండో విడత ప్రచారంలో భాగంగా గ్రామ, బూత్ స్థాయిలో అభ్యర్థి గెలుపునకు చర్యలపై ముఖాముఖీ నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం భోజన విరామం తర్వాత సాయంత్రం 5 గంటలకు ఉండవెల్లి మండల కేంద్రంలో ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నట్లు వివరించారు. మొదటి విడత ప్రచారంలో విశేష స్పందన లభించిందన్నారు.

రేపు జాబ్‌మేళా

గద్వాల అర్బన్: తెలంగాణ స్కిల్స్ అండ్ నాలెడ్జ్ సెంటర్ ఆధ్వర్యంలో 26న ఉదయం 9:30గంటలకు జిల్లా కేంద్రంలోని ఎంఏఎల్‌డీ డిగ్రీ కళాశాలలోని సెమినార్ హాల్‌లో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ షేక్ కలందర్ బాషా, టీఎస్‌కేసీ సమన్వయ కర్త మనోజ్‌కుమార్ బుధవారం ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్ ఎంఎస్ఎన్ ల్యాబోరేటరీస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో ఇంటర్ ఎంపీసీ, బైపీసీ 2022–23, 2023–24 విద్యాసంవత్సరంలో పాసైన విద్యార్థులు, డిగ్రీలో బీఎస్సీ లైఫ్‌సైన్స్ 2020–24 వరకు పాసైన విద్యార్థులకు ఉద్యోగం కోసం ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు వారు పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

అలంపూర్: సబ్ డివిజన్ పరిధిలో విద్యుత్ అంతరాయం కలగనున్నట్లు ఏడీఈ మహ్మద్ చిన్న మక్బుల్ బుధవారం ప్రకటనలో తెలిపారు. నిరంతరమైన నాణ్యమైన విద్యుత్ అందించడానికి అలంపూర్ సబ్ డివిజన్ పరిధిలోని 33 కేవీ, 11కేవీ ఫీడర్‌ల పరిధిలోని విద్యుత్ లైన్‌లకు తాకుతున్న చెట్ల కొమ్మలను, తక్కువ ఎత్తుకు చేరిన విద్యుత్ స్తంభాలను తొలగించడం, ఒరిగిన విద్యుత్ స్తంభాలను సరి చేసే పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కారణంగా 33/11 కేవీ పరిధిలోని అలంపూర్ మున్సిపాలిటీ, భీమవరం, ఉండవెల్లి, అలంపూర్ చౌరస్తా, మారమునగాల, కోదండాపురం, ఇటిక్యాల, సాసనూలు, ఆర్.గార్లపాడు, శాంతినగర్ పట్టణం, మానవపాడు, కలుకుంట్ల సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలకు గురువారం అంతరాయం కలగనున్నట్లు తెలిపారు. అదేవిధంగా విద్యుత్ లైన్ల పనులు చేపడుతున్న 33 కేవీ 11 కేవీ లైన్ 33 కేవీ ఉండవెల్లి, అలంపూర్ మున్సిపాలిటీ, శాంతినగర్ ఫీడర్–2, 11 కేవీ జల్లాపురం, పోతులపాడు, కొంకల, శాంతినగర్–2, పుల్లూరు, క్యాతూర్ ఫీడర్‌లో పనులు చేపడుతున్నట్లు తెలిపారు. మరమ్మతు పనుల కారణంగా ఉదయం 7 గంటల నుంచి ఉదయం 9 గంటల వరకు విద్యుత్ అంతరాయం కలగనున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

నీటి సమస్య రానివ్వద్దు

మానవపాడు: గ్రామాలలో నీటి సమస్య రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీఓ ఆంజనేయరెడ్డి సూచించారు. బుధవారం మండలంలోని చెన్నిపాడు, చిన్నపోతులపాడు, పెద్దపోతులపాడును సందర్శించారు. పెద్దపోతులపాడు, చిన్నపోతులపాడు గ్రామాలలో ఎన్ఆర్ఈజీఎస్ పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. గ్రామాలలో ఉపాధిహామీ పనులను కూలీలకు పనులు కల్పించి ఎండ నుంచి రక్షణను ఏర్పాటు చేయాలని సూచించారు. చెన్నిపాడులో నీటి బోర్లకు మరమ్మతులను పరిశీలించారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

అలంపూర్: ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని ఎమ్మెల్యే విజయుడు అన్నారు. కర్నూల్‌లోని ఎమ్మెల్సీ నివాసంలో సీఎం సహాయ నిధి ద్వారా మంజూరైన ఎల్ఓసీని ఎమ్మెల్యే బుధవారం అందజేశారు. వడ్డేపల్లి మండలం తనగలకు చెందిన లోకేష్ వైద్యం కోసం సీఎం సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. రూ. 1.50 లక్షలు వైద్య ఖర్చుల నిమిత్తం ఎల్ఓసీ మంజూరు కావడంతో ఎమ్మెల్యే అందజేశారు. వీరితోపాటు కరుణసింహా రెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, రఘు రెడ్డి, షబ్బీర్, గోపాల్ తదితరులు ఉన్నారు.

గట్టులో వంద శాతం



గట్టు కస్తూర్బా పాఠశాల



అక్షయ



నాగేశ్వరి



అక్షర



రాధిక



హర్ష

గట్టు: ఇంటర్ ఫలితాల్లో గురుకుల, కస్తూర్బా కళాశాల విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణతను సాధించారు. సాంఘిక సంక్షేమ గురుకుల ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో మొత్తం 78 విదాంమకెంథలె ఉత్తీర్ణను సాధించారు. బైపీసీలో అక్షయ 975, నాగేశ్వరి 970, అక్షర 968, ఎంపీసీలో దీపిక 960, ఎస్తేర్‌రాణి 958 మార్కులను సాధించారు. మొదటి సంవత్సరంలో 79 మంది విద్యార్థులకు 78 మంది ఉత్తీర్ణను సాధించినట్లు ప్రిన్సిపాల్ వాణి తెలిపారు. ద్వితీయ సంవత్సరంలో 79 మందికి 900 పైగా మార్కులు సాధించిన విద్యార్థులు 33 మంది ఉండగా, మొదటి సంవత్సరంలో 79 మందిలో 61 మంది విద్యార్థులు ఉన్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

కస్తూర్బాలో..

గట్టులోని కస్తూర్బా కళాశాల విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో వంద శాతం ఫలితాలను సాధించారు. మొదటి సంవత్సరంలో 68 మందికి గాను 66 మంది ఉత్తీర్ణత సాధించగా, ద్వితీయ సంవత్సరంలో 69 మంది ఉత్తీర్ణతతో వంద శాతం ఫలితాలను సాధించినట్లు ప్రత్యేక అధికారిని గోపిలత తెలిపారు. ఎంపీసీలో రాధిక 961, బీసీపీలో హర్ష 891 మార్కులను, మొదటి సంవత్సరం ఎంపీసీలో భవాని 442, బైపీసీలో బుజ్జి 429 మార్కులను సాధించారు.

ప్రభుత్వ కళాశాలలో..

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరంలో 186 మంది విద్యార్థులకు గాను 111 మంది విద్యార్థులు ఉత్తీర్ణతతో 60 శాతం ఫలితాలను సాధించగా, ద్వితీయ సంవత్సరంలో 155 మంది విద్యార్థులకు 129 విద్యార్థులు ఉత్తీర్ణతతో 83 శాతం ఫలితాలను సాధించినట్లు ప్రిన్సిపాల్ శశిధర్ రెడ్డి తెలిపారు. ఎంపీసీలో విశ్వతేజ 954, శ్వేత 948, ఉరుకుందమ్మ 868 మార్కులను సాధించినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

అలంపూర్‌లో మొదటి సంవత్సరం 40, ద్వితీయ సంవత్సరంలో 65 శాతం ఉత్తీర్ణత



అర్చన (ఎంపీసీ 861)



దుర్గప్రసాద్ (ఎంపీసీ 833)



హిమబిందు (బైపీసీ 941)



ఆకుల సౌమ్య (బైపీసీ 892)



అఫ్రీన్, (సీసీఈ 817)



ఆఫ్రీన్ (బైపీసీ 405)



కస్తూరి ప్రియాంక (బైపీసీ 403)

అలంపూర్: కళాశాలల ఉత్తీర్ణత శాతం తక్కువగా ఉన్నప్పటికీ విద్యార్థులు తమ ప్రతిభను కనబర్చారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరంలో 40 శాతం ఉత్తీర్ణత సాధించగా ద్వితీయ సంవత్సరంలో 65 శాతం ఉత్తీర్ణత సాధించారు. మొదటి సంవత్సరంలో 82 మంది విద్యార్థులకుగాను 33 మంది విద్యార్థులు పాసయ్యారు. మొదటి సంవత్సరం ఎంపీసీలో జబినాబీ 388 మార్కులు, ఎంపీసీలో షేక్ మస్‌బా కౌసర్ 363 మార్కులు సాధించింది. బైపీసీలో ఆఫ్రీన్ 405 మార్కులు, కస్తూరి ప్రియాంక 403 మార్కులు సాధించారు. సీసీఈసీలో గణేష్ 378, బోయ సరళ 322 మార్కులు సాధించారు. రెండో సంవత్సరంలో 77 మంది విద్యార్థులకుగాను 50 మంది విద్యార్థులు పాసయ్యారు. ఎంపీసీలో అర్చన 861 మార్కులు, దుర్గప్రసాద్ 833 మార్కులు సాధించారు. బైపీసీలో హిమబిందు 941, సౌమ్య 892 మార్కులు సాధించారు. సీఈసీలో అఫ్రీన్ 817 మార్కులు, జీ. జయంతి 651 మార్కులు సాధించారు. కళాశాల, గ్రూప్ టాపర్లుగా నిలిచిన విద్యార్థులను ప్రిన్సిపాల్ హృదయ రాజు, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ దేవేందర్, అధ్యాపకులు అభినందించారు.

మల్దకల్‌లో 65శాతం ఉత్తీర్ణత



విశాలాక్షి (బైపీసీ 388)



అలివేలు (బైపీసీ 917)

మల్దకల్: ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు మొదటి సంవత్సరంలో 109మందికి గాను 52మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఇంటర్ రెండో సంవత్సరంలో మొత్తం 60మంది విద్యార్థులకు గాను 39మంది విద్యార్థులు పాసయ్యారు. రెండవ సంవత్సరంలో 65శాతం, మొదటి సంవత్సరంలో 48శాతం ఉత్తీర్ణత సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ రమేష్‌లింగం తెలిపారు. మొదటి సంవత్సరం విశాలాక్షి బైపీసీ విభాగంలో 388, సీఈసీలో సరిత 413, ఎంపీసీ విభాగంలో నందిని 294, ఇంటర్ ద్వితీయ సంవత్సరం బైపీసీలో అలివేలు 917, సీఈసీలో రంజిత్ 811 మార్కులు సాధించినట్లు తెలిపారు.

మానవపాడు జూనియర్ కళాశాలలో..



ధ్రువతార, (ఎంపీసీ 464)



మానస, (బైపీసీ 858)

మానవపాడు: మండలకేంద్రంలోని గంగు వెంకట కృష్ణరెడ్డి మోమెరియల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం 63 మందికి గానూ 14మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. బైపీసీలో మానస 858 మార్కులు సాధించింది. ప్రథమ సంవత్సరంలో 78మంది విద్యార్థులకుగానూ 16మంది ఉత్తీర్ణలయ్యారని, ఎంపీసీలో ధ్రువతార 464 మార్కులు సాధించింది. మండల కేంద్రంలోని కేజీబీవీ కళాశాలలో మొదటిలో ఎంహెచ్‌డబ్ల్యూ 28మంది విద్యార్థులకుగానూ 19మంది ఉత్తీర్ణులయ్యారని, సీఈసీ నుంచి 14మంది విద్యార్థులకుగాను 10మంది ఉత్తీర్ణులైనట్లు తెలిపారు.

పుల్లూరు గురుకుల పాఠశాలలో..

ఉండవెల్లి: మండలంలోని పుల్లూరు మహాత్మ జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలలో ఇంటర్ విద్యార్థులు ఉత్తమ ఫలితాలను సాధించారు. ఎంపీసీ ప్రథమ సంవత్సరంలో 29 మందిలో 25 మంది ఉత్తీర్ణత సాధించారు. బైపీసీ ప్రథమ సంవత్సరంలో 30 మందిలో 25 మంది, ఎంపీసీ ద్వితీయ సంవత్సరంలో 34 మంది ఉండగా, 32 మంది, బైపీసీ ద్వితీయ సంవత్సరంలో 33 మంది ఉండగా అందులో 32 మంది పాసయ్యారు. ఎంపీసీ, బైపీసీ ప్రథమ సంవత్సరంలో 85 శాతం ఉత్తీర్ణులవగా, ద్వితీయ సంవత్సరంలో బైపీసీ, ఎంపీసీ గ్రూపులలో 96 శాతం ఉత్తీర్ణులుగా విద్యార్థులు ప్రతిభ చాటారని ప్రిన్సిపాల్ దేవానందం తెలిపారు. ఎంపీసీ ప్రథమ సంవత్సరంలో నాగమణి 467, బైపీసీలో గాయత్రి 432 మార్కులు సాధించారు. ఎంపీసీ ద్వితీయ సంవత్సరంలో కీర్తి 983 మార్కులు సాధించింది. మైనార్టీ గురుకుల పాఠశాలలో ప్రథమ సంవత్సరం సీఈసీ, హెచ్‌ఈసీ గ్రూపులలో 49 మంది విద్యార్థులుండగా 39 మంది పాసయ్యారు. సీఈసీ, హెచ్‌ఈసీ ద్వితీయ సంవత్సరంలో 43 మంది విద్యార్థులుండగా 39 మంది పాసైనట్లు ప్రిన్సిపాల్ పద్మలత తెలిపారు. ఈ పాఠశాలలో సీఈసీ ప్రథమ సంవత్సరంలో రమీజాబి 454, హెచ్‌ఈసీ ప్రథమ సంవత్సరంలో షేక్ షాహిన్ 464, సీఈసీ ద్వితీయ సంవత్సరంలో రేష్మా 953, హెచ్‌ఈసీలో అప్సా 953 మార్కులు సాధించారు.

వడ్డేపల్లి విద్యార్థుల ప్రతిభ



కార్తీక్, (ఎంపీసీ 456)



విజయలక్ష్మి, (బైపీసీ 407)



దేవి, (ఎంపీసీ 966)



సుమతి (బైపీసీ 925)

శాంతినగర్: వడ్డేపల్లి మున్సిపాలిటీ, మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన ఇంటర్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. వడ్డేపల్లి కేజీబీవీలో మొదటి సంవత్సరం ఎంపీసీ చదువుతున్న విద్యార్థులు 15 మందిలో 13 మంది 80 శాతానికి పైగా మార్కులు సాధించారు. బైపీసీలో 29 మందికి గాను 22 మంది, ద్వితీయ సంవత్సరంలో ఎంపీసీలో 18 మంది విద్యార్థులు పరీక్ష రాయగా వారిలో 15 మంది 84 శాతం మార్కులు తెచ్చుకున్నారు. అంతేగాక బైపీసీలో 26 మందిలో 22 మంది విద్యార్థులు 84 శాతానికి పైగా మార్కులు సాధించి కేజీబీవీ కళాశాలకు వన్నె తెచ్చారు. మొదటి సంవత్సరం ఎంపీసీలో రమాదేవి 447 మార్కులు, బైపీసీలో విజయలక్ష్మి 407 మార్కులు సాధించి టాపర్‌గా నిలిచారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో నందిని 961 మార్కులు, బైపీసీలో 925 మార్కులు సాధించిన సుమతి టాపర్‌గా పేరుతెచ్చుకున్నారు. ఎల్ఎస్ఆర్ జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించారు. కళాశాలలో మొదటి సంవత్సరం ఎంపీసీ చదువుతున్న కార్తీక్ 456 మార్కులు, బైపీసీ చదువుతున్న మైత్రి 341 మార్కులు, ద్వితీయ సంవత్సరంలో ఎంపీసీలో 966 మార్కులు సాధించిన దేవి టాపర్‌గా నిలిచారు. బైపీసీలో 921 మార్కులు సాధించిన మైబు సుల్తాన్ టాపర్‌గా నిలిచారు.

డాక్టర్ కావాలన్న కల..



ఇంటర్ ద్వితీయ సంవత్సరం బైపీసీలో 967 మార్కులు సాధించడం చాలా గర్వంగా ఉంది. నాకు తల్లిదండ్రులు లేరు. మా అమ్మమ్మ వల్లే పుల్లూరులోని మహాత్మ జ్యోతిరావుపూలే గురుకులలో సీటు పొంది మంచి మార్కులు సాధించాను. నీట్ కోచింగ్ తీసుకుంటున్నా.. డాక్టర్ కావలనేది నా కల. –ఇందు, పులికల్, అయిజ మండలం

మా నాన్న కల నేరవేరుస్తా..



ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ఎంపీసీలో 467 మార్కులు సాధించాను. మా తండ్రి వ్యవసాయం చేస్తుంటారు. పుల్లూరు మహాత్మ జ్యోతిరావు పూలే గురుకుల సీటు సాధించి ఉత్తమ ఫలితాలు సాధించాను. నేను సాఫ్ట్‌వేర్ ఉద్యోగం సాధించి మా తల్లిదండ్రులకు కష్టం లేకుండా చూసుకుంటాను.

–నాగమణి, మల్దకల్ మండలం, ఎల్కూరు

సత్తా చాటిన ధరూర్ కళాశాల విద్యార్థులు



రమీజా (ఎంపీసీ 961)



సునీత (బైపీసీ 942)

ధరూరు: ఇంటర్ ఫలితాల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు సత్తా చాటారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సర ఫలితాల్లో జిల్లా స్థాయి మొదటి స్థానంలో నిలిచారు. కళాశాలలో మొత్తం 167 మంది పరీక్షలు రాయగా, అందులో 113 మంది ఉత్తీర్ణత సాధించారు. ఎంపీసీలో రమీజా 961 మార్కులు సాధిందని, బైపీసీలో సునీత 942 మార్కులు సాధించినట్లు ప్రిన్సిపాల్ కృష్ణ తెలిపారు.

మెరిసిన బీచుపల్లి గురుకుల విద్యార్థులు



కే.శ్రీనాథ్, (ఎంపీసీ 989)



డీ.నితిన్, (బైపీసీ 972)



ఎం. చందు, (బైపీసీ 972)



కే.శివకుమార్, (ఎంపీసీ 466)



కే.భరత్‌కుమార్, (బైపీసీ 440)

ఎర్రవల్లిచౌరస్తా: ఎర్రవల్లి మండలంలోని బీచుపల్లి గురుకుల కళాశాలకు చెందిన ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ఇంటర్ ఫలితాలలో అత్యధిక ఉత్తీర్ణత సాధించారు. కళాశాలలో సీనియర్ ఎంపీసీలో కే.శ్రీనాథ్ 989, ఎస్.నవదీప్ 970, సీనియర్ బైపీసీలో డీ.నితిన్ 972, ముడావత్ చందు 972 మార్కులను సాధించారు. జూనియర్ ఎంపీసీలో కే.శివకుమార్ 466, వై.రఘు 465 మార్కులు, బైపీసీలో ఎం.భరత్‌కుమార్ 435, టీ.నవీన్ 427 మార్కులతో అధిక ఉత్తీర్ణతను సాధించారు. ఇటిక్యాల సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో సీనియర్ ఇంటర్‌లో 53.31 శాతం, జూనియర్ ఇంటర్‌లో 62.16 శాతం ఉత్తీర్ణతను సాధించారు. ఎర్రవల్లి (అయిజ) సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో సీనియర్ ఇంటర్‌లో 52 శాతం, జూనియర్ ఇంటర్‌లో 44.23 శాతం ఉత్తీర్ణతను సాధించారు. ఈ సందర్భంగా ఆయా కళాశాలలకు చెందిన విద్యార్థులను హెచ్ఎంలు, అధ్యాపకులు అభినందించారు.

అయిజ మండలంలో మిశ్రమ ఫలితాలు

అయిజ: మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు మిశ్రమ ఫలితాలు సాధించారు. మొదటి సంవత్సరం మొత్తం 153 మంది పరీక్షలు రాయగా 67 మంది (44 శాతం) మాత్రమే పాసయ్యారు. ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 142 మంది పరీక్షలు రాయగా వారిలో 101 (71 శాతం) మంది విద్యార్థులు పాసయ్యారు. మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఇంటర్ మొదటి సంవత్సరం సీఈసీ విభాగంలో 24 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 21 మంది పాసయ్యారు. ఎంపీడబ్ల్యూహెచ్ విభాగంలో మొత్తం 40 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 33 మంది పాసయ్యారు. ద్వితీయ సంవత్సరం విద్యార్థులు సీఈసీ విభాగంలో 27 మంది పరీక్షలు రాయగా 24 మంది పాసయ్యారు. ఎంపీడబ్ల్యూహెచ్ విభాగంలో 27 మంది పరీక్షలు రాయగా 24 మంది పాసయ్యారు.

భక్తిశ్రద్ధలతో ప్రతిష్ఠాపన ఉత్సవం



ధ్వజస్తంభానికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు



ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలను సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

శాంతినగర్: వడ్డేపల్లి మండలంలోని రామాపురంలో బుధవారం ఉభయలింగేశ్వరస్వామి, వివిధ దేవతా మూర్తుల ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని ఆలయ కమిటీ సభ్యులు, ప్రజలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. దేవతామూర్తుల విగ్రహాల కింద పెట్టే యంత్రాలకు బ్రాహ్మణులు పూజలు నిర్వహించిన అనంతరం వాటి ప్రతిష్ఠ చేశారు. రూ.కోటి వ్యయంతో నిర్మించిన ఆలయ సముదాయాన్ని, వినాయకుడు, సుబ్రహ్మణ్యస్వామి, వివిధ దేవతామూర్తుల విగ్రహాలను వేదమంత్రాల సాక్షిగా ప్రతిష్ఠించారు. ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమం వైభవంగా నిర్వహించారు.

హాజరైన ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే

ప్రతిష్ఠ కార్యక్రమానికి ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి, ఎమ్మెల్యే విజయుడు, వివిధ మండలాలకు చెందిన ప్రజాప్రతినిధులు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం చక్కగా నిర్మించారని, వేలాది మంది ప్రజలు ప్రతిష్ఠ కార్యక్రమానికి హాజరై పూజలు నిర్వహించడం శుభ పరిణామమని ఎమ్మెల్సీ తెలిపారు.

ఉపాధి పనుల పరిశీలన



కూలీలకు సూచనలు చేస్తున్న ఎంపీడీఓ వెంకటయ్య

అయిజ: మండలంలోని కిష్టాపురం శివారులో నిర్వహిస్తున్న ఉపాధి హామీ పథకం పనులను బుధవారం ఎంపీడీఓ వెంకటయ్య పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడారు. ఉపాధి కూలీలు పనిచేసే స్థలంలో తాగునీటి సౌకర్యం కల్పించాలని, షేడ్ నెట్ ఏర్పాటు చేయాలని, ఓఆర్ఎస్ ప్యాకెట్, ఫస్ట్ ఎయిడ్ బాక్స్‌లు అందుబాటులో ఉంచాలని అధికారులకు సూచించారు. ప్రతి కూలీకి ప్రతిరోజు రూ. 300 కూలి వచ్చేటట్లు కొలతలు ఇచ్చి పని చేయించాలని ఆదేశించారు. పనికి వచ్చిన ప్రతి జాబ్ కార్డ్ వంద రోజులు పూర్తి అయ్యేటట్లు చూడాలని, ప్రతి కుటుంబానికి 100 రోజులలో రూ. 25 వేలనుంచి రూ. 30 వేల వరకు వేతనం వచ్చేలా కొలతలు ఇచ్చి పని చేయించాలని సూచించారు. అదేవిధంగా ఉపాధి కూలీలతో మాట్లాడారు. ఎండ వేడి ఎక్కువ కాక ముందే పనులు ముగిసేలా చూసుకోవాలని సూచించారు.

మెడికల్ ఏజెన్సీలో మందులు సీజ్



తనిఖీ చేస్తున్న అధికారులు

అయిజ: పట్టణంలోని వెంకటసాయి మెడికల్ ఏజెన్సీని డ్రగ్ ఇన్‌స్పెక్టర్ మహ్మద్ రఫి బుధవారం తనిఖీ చేశారు. డైక్లోజన్ పోర్ట్ 20 స్ట్రిప్పుల మాత్రలను సీజ్ చేశారు. మహబూబ్‌నగర్ మెడికల్ అసిస్టెంట్ డైరెక్టర్ దినేష్ కుమార్ ఆదేశంతో నారాయణపేట డ్రగ్ ఇన్‌స్పెక్టర్ క్రాంతి కుమార్‌తో కలిసి మెడికల్ ఏజెన్సీలో తనిఖీ నిర్వహించారు. మధ్యప్రదేశ్ చిత్రా డ్రగ్స్ కంపెనీ తయారు చేసిన డైక్లోజన్ ఫోర్ట్ టాబ్లెట్లు మెడికల్ ప్రామాణికాలు పాటించకపోవడంతో సీజ్ చేసినట్లు తెలిపారు. విషయాన్ని గద్వాల కోర్టు ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ దృష్టికి తీసుకెళ్తామని అధికారులు తెలిపారు.

నిప్పంటించుకుని వివాహిత ఆత్మహత్య

ధరూరు: వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని మాల్‌దొడ్డిలో చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన శారద(42) మంగళవారం ఉదయం తాము పొలం పనులకు వెళ్తున్నామని, ఇంటి వద్ద పని చేయాలని కుటుంబ సభ్యులు గట్టిగా చెప్పడంతో మనస్తాపం చెంది ఇంట్లో ఉన్న పెట్రోల్ ఒంటిపై పోసుకుని నిప్పంటించుకుంది. గమనించిన కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం గద్వాల ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్ తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు.

బాలల హక్కులపై అవగాహన కలిగి ఉండాలి



మాట్లాడుతున్న సీడీపీఓ కమలాదేవి

అయిజ: రాజ్యాంగం బాలలకు అనేక హక్కులు కల్పించిందని, దీనిపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని సీడీపీఓ కమలాదేవి అన్నారు. బుధవారం మండలంలోని మేడికొండ ప్రభుత్వ పాఠశాలలో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 'బాలల హక్కులు, చట్టాలు' ఇతర అంశాలపై విద్యార్థులకు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీడీపీఓ కమలాదేవి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. బాల్యం పిల్లల హక్కు అని, బాలలందరూ స్వేచ్ఛాయుత వాతావరణంలో పెరగాలని అన్నారు. చిన్నప్పటి నుంచి లక్ష్యం పెట్టుకుని చదివి జీవితంలో గొప్పస్థాయికి ఎదిగి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు పేరు ప్రఖ్యాతులు తీసుకరావాలని తెలిపారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ యామిని, ఐసీపీఎస్ ఓఆర్ డబ్ల్యూ ప్రకాష్ పాల్గొన్నారు.

గ్రామాల్లో ప్రజల చెంతకే పోలీసులు



అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ శ్రీనివాస్‌రావు

కేటీదొడ్డి: గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న విపత్కర సమస్యలు, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రతి గ్రామంలో వారంలో రెండు రోజులు ప్రజల చెంతకు పోలీసు సిబ్బంది వస్తారని ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని రంగాపురంలో బుధవారం ఎస్ఐ ప్రజలతో సమావేశం ఏర్పాటు చేసి అవగాహన కల్పించారు. సైబర్ నేరాలు, మహిళా వేధింపులు, చోరీలు, పోక్సో కేసులు, మత్తు పదార్థాలు, రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ప్రజల వద్దకు పోలీసు సిబ్బంది వచ్చినప్పుడు ధైర్యంగా సమస్యలను తెలియజేయాలని తెలిపారు.

సైబర్ మోసాల బారిన పడొద్దు



చంద్రశేఖర్‌నగర్‌లో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ చంద్రకాంత్

మానవపాడు: సైబర్ నేరాల బారిన పడకుండా గ్రామీణులకు అవగాహన కల్పించామని ఎస్ఐ చంద్రకాంత్ తెలిపారు. బుధవారం మండలంలోని చంద్రశేఖర్‌నగర్‌లో సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ప్రజలకు అత్యవసర సమయంలో పోలీస్ సాయం పొందాలని భావించినప్పుడు వెంటనే డయల్ 100కు ఫోన్ చేయాలని, వెంటనే బ్లూ కోల్ట్స్ సిబ్బంది అక్కడకు చేరుకుని చర్యలు తీసుకుంటారని చెప్పారు. రోడ్డు ప్రమాదాలకు గురికాకుండా ట్రాఫిక్ నియామాలను పాటించాలన్నారు. బాలికలను వేధిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.